ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

5

శుక్రవారం 1 మార్చి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	18004251442
యాదాద్రి	1800 425 7106
సూర్యాపేట	1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.157	228	259
సూర్యాపేట	రూ.160	230	260
నల్లగొండ	రూ.160	230	260

ఉష్ణోగ్రత గరిష్ఠం 35.0 । కనిష్ఠం 23.8

అడుగంటిన ఆశలు

- ప్రాజెక్టుల్లో నీరు అంతంతమాత్రమే
- ఒట్టిపోయిన చెరువులు, కుంటలు
- అడుగంటిన భూగర్భ జలాలు
- ఆసరా ఇవ్వని బోర్లు
- యాసంగి వరిపై ఆశలు వదులుకున్న రైతులు



సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దొరకుంటలో ఎండిపోయిన వరిపొలాన్ని మేస్తున్న పశువులు

వానాకాలంలో వరుణుడు కరుణ చూపకపోవడంతో ప్రాజెక్టుల్లోకి వరద చేరలేదు. ఫలితంగా ప్రాజెక్టులు డెడ్‌స్టోరేజీకి చేరువలో ఉండగా, నీటి నిల్వలు కేవలం తాగునీటి అవసరాలకే ఉన్నాయి. యాసంగిలో బోరుబావుల ఆధారంగా వరి సాగుచేసిన రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. ప్రాజెక్టుల నుంచి కాల్వలకు నీటి విడుదల లేకపోవడంతో ఆయకట్టులోని చెరువులు, కుంటలు ఒట్టిపోయాయి. భూగర్భ జలమట్టం పడిపోవడంతో బోర్లు ఆగి ఆగి పోస్తున్నాయి. ఈ నీరు ఏమాత్రం సరిపోక యాసంగి వరి చేలు నెర్రెలుబారుతున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు యాసంగి వరిపై ఆశలు వదులుకుంటున్నారు. కళ్ల ఎదుటే ఎండుతున్న పంటను చూసి కన్నీళ్లను దిగమింగి వరి చేలల్లో పశువులను మేపుతున్నారు. కృష్ణానదిలో నీరు తగ్గడంతో నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం కేంద్రంలోని ఓ రైతు పొలంలోకి మొసలి వచ్చింది.

● వివరాలు 7లో..

● పొలాల్లోకి మొసలి

కృష్ణానదిలో నీరు తగ్గడమే కారణం



నల్లగొండ జిల్లా త్రిపురారం మండల కేంద్రంలో ఓ రైతు పొలంలో కనిపించిన మొసలి

ఉమ్మడి జిల్లాలో 1,268 పోస్టులు

- ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ
- మెగా డీఎస్సీతో నిరుద్యోగుల్లో చిగురించిన ఆశలు



నల్లగొండ, ఫిబ్రవరి 29: ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గురువారం డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,268 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనుంది. జిల్లాల వారీగా అందుబాటులో ఉన్న ఖాళీలను పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. నల్లగొండ జిల్లాలో మొత్తం 605 పోస్టులు, సూర్యాపేట జిల్లాలో 386, యాదాద్రి జిల్లాలో 277 పోస్టులు భర్తీ కానున్నాయి. జిల్లా స్థాయి ఎంపిక కమిటీల ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నారు. జిల్లా పరిషత్, మండల పరిషత్, ప్రభుత్వ పాఠశాల్లో ఖాళీలను డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తారు. డీఎస్సీ కోసం గతంలో దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వం పేర్కొంది. కొత్తగా దరఖాస్తు చేసే అభ్యర్థులు రూ.1000 ఫీజు చెల్లించాలి. ఒకటి కంటే ఎక్కువ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ప్రతీ పోస్టుకు వేరుగా దరఖాస్తు చేయాలి. పరీక్ష కేంద్రాల కేటాయింపు ముందుగా దరఖాస్తు చేసుకున్న వారికి ముందు ప్రాతిపదికన చేసే అవకాశాలు ఉన్నాయి.

ఈసారి ప్రత్యేకంగా స్పెషల్ టీచర్స్


రాష్ట్ర ప్రభుత్వం ఈసారి మెగా డీఎస్సీలో స్పెషల్ టీచర్స్ పోస్టుల భర్తీకి నిర్ణయం తీసుకుంది. అదనంగా 141 పోస్టులు ఈ కేటగిరీలో చూపింది. దీంట్లో కొన్ని పోస్టులు మానెటరింగ్ చేయడానికి కేటాయించగా, అంధులు, చెవిటి, మూగ అభ్యర్థులతో ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. గత ఏడాది డీఎస్సీ నోటిఫికేషన్ కంటే ఈసారి మెగా డీఎస్సీలో ఉమ్మడి జిల్లాలో పోస్టుల సంఖ్య భారీగా పెరిగింది. గత సంవత్సరం సెప్టెంబరు 6వ తేదీన జారీ చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో తక్కువ పోస్టులు ఉన్నాయి. ఆ నోటిఫికేషన్ రద్దు చేసి తాజాగా జారీ చేసిన నోటిఫికేషన్‌తో పోస్టులు పెరగడంతో నిరుద్యోగులు ఉత్సాహంగా ఉన్నారు. గతంలో జారీ చేసిన నోటిఫికేషన్‌లో నల్లగొండ జిల్లాలో 219 పోస్టులు చూపగా, ఈసారి మొత్తం 605 ఉన్నాయి. సూర్యాపేట జిల్లాలో గతంలో 185 పోస్టులు ఉండగా, ఈసారి 386 ఖాళీగా చూపించారు. యాదాద్రి జిల్లాలో గతంలో 99 పోస్టులు మాత్రమే ఖాళీగా ఉండగా, ఈసారి 277 చూపించారు. గత ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌లో 503 పోస్టులు ఉండగా, ప్రస్తుత ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీలో 1268 పోస్టులను భర్తీ చేయనుంది.

ఉమ్మడి జిల్లాలో పోస్టులు ఇలా..

జిల్లా	ఎస్ఏ	ఎస్‌జీటీ	ఎల్‌పీటీ	పీఈటీ	స్పెషల్ టీచర్స్	మొత్తం
నల్లగొండ	128	383	28	06	60	605
సూర్యాపేట	86	224	23	05	48	386
యాదాద్రి	84	137	21	02	33	277

ఫైల్ పెండింగ్‌లోనే

- అధికారుల్లో వణుకు
- గొర్రెల యూనిట్ల ఫైల్‌పై అనుమానాలు
- పరిశీలించాకే తుది నిర్ణయమని పక్కన పెట్టిన కలెక్టర్
- తప్పులు కప్పిపుచ్చుకునే యత్నంలో పశుసంవర్ధకశాఖ



నల్లగొండ, ఫిబ్రవరి 29: గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలో గొర్రెల యూనిట్ల కొనుగోళ్లలో అక్రమాలు పెద్దఎత్తున జరిగాయన్న అనుమానాలు బలపడుతున్నాయి. నల్లగొండ జిల్లాలో సుమారు 1,066 యూనిట్ల కొనుగోలు విషయంలో ఇప్పటికే పలు ఆరోపణలు ఉన్నాయి. దీనికి సంబంధించిన ఫైల్‌పై నల్లగొండ జిల్లా గత కలెక్టర్ కర్ణన్‌కు అనుమానాలు రావడంతో పక్కన పెట్టారు. ఇంతలో ఆయన బదిలీ అయ్యారు. ప్రస్తుత కలెక్టర్ హరిచందన సైతం ఈ ఫైల్‌ను పూర్తి స్థాయిలో పరిశీలించాకే నిర్ణయం తీసుకుంటామని పెండింగ్‌లో ఉంచారు. పలుమార్లు పశుసంవర్థకశాఖ అధికారులు ఈ ఫైల్ క్లియరెన్స్ కోసం వెళ్లినా చుక్కెదురైంది. గొర్రెల పంపిణీ పథకం నిధులను పక్కదారి పట్టించిన కేసులో ఇటీవల కామారెడ్డి, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన నలుగురు అధికారులను అరెస్ట్ చేసిన ఏసీబీ, వారిని గురువారం నుంచి కస్టడీలోకి తీసుకొని విచారిస్తోంది. దీంతో నల్లగొండ జిల్లాలో జరిగిన అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉండటంతో అధికారుల్లో ఆందోళన మొదలైంది.

తప్పులను కప్పిపుచ్చుకునేందుకు

బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రస్థాయిలో పనిచేసిన అధికారులతో పాటు కీలక ప్రజాప్రతినిధులు సైతం ఈ అవినీతి ఉచ్చులో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. నిబంధనల మేరకు ఒక్కో రైతు నుంచి 10నుంచి 12 యూనిట్లు మాత్రమే కొనుగోలు చేయాలి. దీనికి విరుద్ధంగా జిల్లాలోని కొందరు అధికారులు 1,066యూనిట్లలో ఏకంగా 832 యూనిట్లను దళారుల నుంచి కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఇది నిబంధనలకు విరుద్ధమైనప్పటికీ జిల్లా అధికారులతో పాటు రాష్ట్రస్థాయి అధికారులు అలాంటి నిబంధన లేదనే వాదాన్ని తెరపైకి తీసుకువస్తున్నారు. అయితే ఒక్క రైతు వద్ద ఇన్ని యూనిట్లు ఎలా ఉంటాయనేదానికి అధికారులు సమాధానం ఇవ్వడం లేదు.

పశుసంవర్ధక శాఖలో సిబ్బంది కొరతతో అప్పటి ప్రభుత్వం ఇతర శాఖల నుంచి కూడా అధికారులను కేటాయించింది. కొందరు అధికారులు ఎంతో ఆసక్తితో ఈ డ్యూటీ వేయించుకున్నట్లు సమాచారం. ఏపీలోని ఇతర జిల్లాల్లో గొర్రెల కొనుగోళ్ల కోసం మూడు శాఖలకు చెందిన ఉన్నతాధికారులు కూడా వెళ్లారు. ఓ అధికారి అయితే రాత్రింబవళ్లు గొర్రెల కొనుగోళ్లలోనే ఉన్నట్టు తెలిసింది. సదరు అధికారి కొనుగోలు చేసిన గొర్రెల యూనిట్లు లబ్ధిదారులకు చేరాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర స్థాయిలో అప్పటి అధికారులకు సత్సంబంధాలు ఉన్న జిల్లాకు చెందిన ఇతర శాఖల అధికారులు గొర్రెల కొనుగోళ్ల కోసం ఏపీలోని ప్రకాశం జిల్లాకు వెళ్లారు. జీవో 52 ప్రకారం ఒక్కో రైతు నుంచి 10నుంచి 12యూనిట్లు కొనుగోలు చేయాలి. కానీ కర్నూలు జిల్లాలో కూడా దళారుల నుంచి గొర్రెల యూనిట్లను సేకరించారు.

ఏసీబీ దృష్టి సారించే అవకాశాలు

హైదరాబాద్‌లో ఏసీబీ అధికారులు ఇప్పటికే వివిధ శాఖలకు చెందిన అధికారులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తుండటంతో వారిచ్చే సమాచారం ఆధారంగా జిల్లాలో గొర్రెల యూనిట్ల కొనుగోలుకు సంబంధించిన ఫైళ్లను స్వాధీనం చేసుకునే అవకాశాలు ఉన్నాయని సంబంధిత శాఖ ఉద్యోగులు పేర్కొంటున్నారు. కాగ్ నివేదిక సైతం నల్లగొండ జిల్లాలో గొర్రెల కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయని తేటతెల్లం చేసింది. దీంతో ఏ క్షణమైన రికార్డులను స్వాధీనం చేసుకునే అవకాశాలు ఉన్నాయి. గొర్రెల పంపిణీ పథకం నేపథ్యంలో నల్లగొండ జిల్లాలో 126 గొర్రెలను ఒక ఆటోలో తరలించినట్టు అధికారులు రికార్డులో చూపించారు. ఇన్‌వాయిస్‌లో పేర్కొన్న వాహనాల నెంబర్లు కూడా తప్పులే. నకిలీ ఇన్‌వాయిస్‌లకు బిల్లులు చెల్లించారని ఇప్పటికే కాగ్ గుర్తించింది. ఒక్క నల్లగొండ జిల్లాలోనే 1172 ఉదంతాల్లో నకిలీ ఇన్‌వాయిస్‌లకు చెల్లింపులు చేసినట్లు కాగ్ నివేదికలో పేర్కొంది.

కలెక్టర్ ఇంకా ఫైల్‌ను పరిశీలించలేదు

నల్లగొండ జిల్లాలో గతంలో కొనుగోలుచేసిన గొర్రెల యూనిట్ల ఫైల్ కలెక్టర్ వద్ద ఇంకా పరిశీలనలో ఉంది. పూర్తిగా ఫైల్‌ను పరిశీలించాకే నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. కొనుగోళ్లకు, బిల్లులకు సంబంధించి ఏం పొరపాట్లు జరిగాయో నా వద్ద సమాచారం లేదు. నేను ఇక్కడ బాధ్యతలు చేపట్టకముందే గొర్రెల కొనుగోళ్లకు సంబంధించిన ఫైల్ అప్పటి కలెక్టర్ కర్ణన్ ఉన్న సమయంలో కలెక్టరేట్‌కు పంపారు. అప్పటి నుంచి ఆ ఫైల్ కలెక్టరేట్‌లోనే పెండింగ్‌లోనే ఉంది. ప్రస్తుత కలెక్టర్ సైతం ఫైల్‌ను పూర్తిస్థాయిలో పరిశీలిస్తామని చెప్పారు.

ఎంవీ.సుబ్బారావు, పశుసంవర్ధకశాఖ నల్లగొండ జేడీ

పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

● కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 29: ఐదేళ్లలోపు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయించాలని కలెక్టర్ హనుమంతు కే. జెండగే సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జాతీయ పోలియో దినోత్సం సందర్భంగా ఈ నెల 3న (ఆదివారం) పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా 63,405 మంది ఐదేళ్లలోపు చిన్నారులను గుర్తించామని, వీరికి 21 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరిధిలో 420 పోలియో ద్వారా 1,680మంది సిబ్బంది, 68మంది రూట్ సూపర్‌వైజర్లను నియమించినట్లు చెప్పారు. అదేవిధంగా 56 మొబైల్ టీంలు, బస్టాండ్, రైల్వేస్టేషన్, జన సమూహాలు అధికంగా ఉండే 17 ట్రాన్సిస్ట్ ప్రాంతాలను, 319 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించినట్లు చెప్పారు. మార్చి 3న పూర్తిస్థాయిలో పిల్లలకు చుక్కలు వేయకపోతే తిరిగి 4, 5 తేదీల్లో ఇంటింటి వెళ్లి చుక్కలు వేయాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు పోలియో చుక్కల మందును తప్పనిసరిగా వేయించి పోలియోరహిత సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేయాలన్నారు. సమీక్షలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పరిపూర్ణచారి, జడ్పీ సీఈవో ఎన్ శోభరాణి, ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వంశీకృష్ణ, బీసీ సంక్షేమ అధికారి పి.యాదయ్య, విద్యా, మహిళ, శిశు సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సెకండియర్ పరీక్షలు ప్రారంభం

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 29: జిల్లావ్యాప్తంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9గంటలకు ప్రారంభమైన పరీక్షలు మధ్యాహ్నం 12గంటల వరకు సాగాయి. 30 కేంద్రాల్లో నిర్వహించిన తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం పరీక్షల్లో 5,891మంది విద్యార్థులకు 5,724మంది విద్యార్థులు హాజరు కాగా, 167 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అధికారులు నిమిషం నిబంధన అమలు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద సిబ్బంది విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించి లోనికి అనుమతించగా, పోలీసులు పరీక్ష కేంద్రాల వద్ద గట్టిబందోబస్తు చేపట్టారు. ఆర్టీసీ బస్సుల్లో కొందరు, సొంత వాహనాలపై మరికొందరు కేంద్రాలకు చేరుకున్నారు.

‘ధరణి’ సమస్యల పరిష్కారానికి చర్యలు

● ధరణి భూ సమస్యల వేదిక రాష్ట్ర కన్వీనర్ మన్నే నర్సింహారెడ్డి

చౌటుప్పల్ టౌన్, ఫిబ్రవరి 29: ధరణిలో నెలకొన్న భూసమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కార్యాచరణపై హర్షం వ్యక్తమవుతోందని ధరణి భూ సమస్యల వేదిక రాష్ట్ర కన్వీనర్ మన్నె నర్సింహారెడ్డి అన్నారు. చౌటుప్పల్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ధరణి భూ సమస్యలను పరిష్కరించేందుకు తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్, సీసీఎల్ఏలకు ప్రభుత్వం అధికారాలను కల్పిస్తూ మార్గదర్శకాలను జారీ చేసిందన్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు మండలాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తారని, రాష్ట్రవ్యాప్తంగా 2.40 లక్షల మంది రైతుల దరఖాస్తులను పరిష్కరించాల్సి ఉందన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ధరణి భూ సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుందన్నారు.

నేటినుంచి ‘గృహజ్యోతి’ జీరో బిల్లులు

మోత్కూరు, ఫిబ్రవరి 29: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గృహజ్యోతి పథకంలో గృహాలకు 200 యూనిట్లలోపు విద్యుత్ వాడుకునే వినియోగదారులకు శుక్రవారం (ఈ నెల1) నుంచి జీరో బిల్లులు ఇస్తామని మోత్కూరు మండల విద్యుత్ ఏఈ హుస్సేన్ తెలిపారు. మోత్కూరు మండలం, మునిసిపాలిటీలో కలిసి సుమారు 3వేల మంది వినియోగదారులు ఈ పథకంలో లబ్ధిపొందనున్నారన్నారు. లబ్ధిదారుల జాబితా కూడా నేడు లేదా రేపు రావచ్చన్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న వారికి మాత్రమే ప్రభుత్వం ‘గృహజ్యోతి’ పథకం వర్తింపజేస్తున్నదన్నారు. తెల్లరేషన్ కార్డు ఉండి, లబ్ధిదారుల జాబితాలో పేరు రానివారు తమ సిబ్బంది బిల్లులు కొట్టేప్పుడు వారితో వాదనకు దిగవద్దన్నారు. జాబితాలో పేరు రానివారు ప్రజాపాలన పోర్టల్‌లో తిరిగి దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తుస్తోందన్నారు.

హరితహారానికి మొక్కలు సిద్ధం చేయాలి

● జడ్పీ సీఈవో శోభారాణి

భువనగిరి రూరల్, ఫిబ్రవరి 29: మానవాళి మనుగడకు చెట్లు ఎంతో దోహదపడతాయని, హరితహారం కార్యక్రమానికి మొక్కలను సిద్ధం చేయాలని జడ్పీ సీఈవో ఎస్.శోభారాణి అన్నారు. గురువారం మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామాపంచాయతీ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించి రికార్డులను పరిశీలించారు. వేసవి దృష్ట్యా గ్రామస్థులకు ఇబ్బందులు తలెత్తకుండా నీటి సరఫరా చేపట్టాలని సూచించారు. నర్సరీలో మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మౌలిక వసతుల కల్పనలో యుద్ధ ప్రాతిపదికన సేవలందించాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ సంతోష్, పంచాయతీ కార్యదర్శి పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మొక్కలను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో శోభారాణి

నెల రోజులు 30, 30(ఏ) పోలీసు యాక్ట్ అమలు

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 29 : శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని మార్చి1వ తేదీ నుంచి 30తేదీ వరకు నెల రోజుల పాటు నల్లగొండ జిల్లావ్యాప్తంగా 30, 30(ఏ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని నల్లగొండ జిల్లా ఎస్పీ చందనాదీపి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేనిది జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించ కూడదని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగే విధంగా, ప్రజాధనానికి నష్టం కలిగించే చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదన్నారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఈ విషయంలో పోలీసు అధికారులకు సహకరించాలని కోరారు. ఎలాంటి అనుమతి లేకుండా సభలు సమావేశాలు, నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాలికతో అసభ్యకర ప్రవర్తన

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 29 : బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిపై నల్లగొండ జిల్లాలో పోక్సో కేసు నమోదైంది. నల్లగొండ టూటౌన్ ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండకు చెందిన అవివాహితుడైన రాపోలు నరేష్ పట్టణంలోని ఓ చికెన్‌సెంటర్‌లో పనిచేస్తూ వచ్చిన డబ్బుతో మద్యం తాగి తిరుగుతుండేవాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం పట్టణంలోని ఓ కాలనీకి చెందిన తొమ్మిదేళ్ల బాలిక స్కూల్‌కు వెళ్లి వచ్చి తమ తాత ఇంట్లో ఒంటరిగా ఆడుకుంటోంది. గమనించిన నరేష్ బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో సదరు బాలిక ఏడ్చుకుంటూ వెళ్లి తల్లికి చెప్పడంతో ఆమె వచ్చేసరికి నరేష్ అక్కడి నుంచి పరారయ్యాడు. వెంటనే బాధితురాలి తల్లి స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా, నరేష్‌పై పోక్సో కేసును నమోదుచేశారు. నిందితుడు నరేష్ పరారీలో ఉన్నాడని, అతడి ఆచూకీ కోసం వెతుకుతున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

మేడారం జాతరలో ఒకరి అదృశ్యం

తాడ్వాయి, ఫిబ్రవరి 29 : మేడారం జాతరలో సూర్యాపేట జిల్లా వాసి అదృశ్యమయ్యాడు. ఇందుకు సంబంధించి గురువారం అతడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం గొట్టిపర్తి గ్రామానికి చెందిన ముత్యం కొమురయ్య(45) కుటుంబం మేడారం జాతరకు వచ్చింది. ఊరట్టం క్రాస్‌లోని స్థూపం పరిసరాల్లో బసచేసింది. బుధవారం అర్ధరాత్రి మూత్ర విసర్జన కోసం బయటకు వెళ్లిన కొమురయ్య తిరిగి రాలేదని ఆయన భార్య సుజాత కన్నీటి పర్యంతమైంది. ఆచూకీ తెలిసిన వారు 6303454968, 6303068621, 8106737107 నంబర్లకు సమాచారం అందించాలని ఆమె విజ్ఞప్తి చేసింది.

వలిగొండ మండలంలో వివాహిత..

వలిగొండ, ఫిబ్రవరి 29: యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని గోకారం గ్రామానికి చెందిన వివాహిత నారి మనీష అదృశ్యమైంది. ఎస్ఐ మహేందర్ లాల్ తెలిపిన వివరాల ప్రకారం భర్తతో ఆరు నెలల క్రితం భర్తతో విడాకులు తీసుకొని పుట్టింట్లోనే ఉంటోంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి నుంచి కనబడకుండా పోయింది. చుట్టు పక్కలా, బంధువుల ఇళ్లలో వెతికినా ఫలితం కనబడలేదు. తండ్రి నారి అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యాదగిరీశుడి సన్నిధిలో నిత్యకైంకర్యాలు

- స్వామి సేవలో సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి
- నిత్య ఆదాయం రూ.18.53లక్షలు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 29: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో గురువారం నిత్యకైంకర్యాలు ఆగమ శాస్త్రరీతిలో వైభవంగా నిర్వహించారు. ప్రభాతవేళ సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపిన ఆచార్యులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠా అలంకారమూర్తులను వేదమంత్రోచ్ఛరణలతో పంచామృతాభిషేకం జరిపి తులసీ దళాలతో అర్చించారు. ప్రధానాలయ అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హోమం జరిపారు. అనంతరం గజవాహన సేవోత్సవం నిర్వహించి విశ్వక్సేనుడికి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణం నిర్వహించారు. సాయంత్రం వేళ ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం, అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు కొనసాగాయి. కొండపైన అనుబంధ శివాలయంలో రామలింగేశ్వరస్వామికి, మహామండపంలో స్పటిక మూర్తులకు నిత్యవిధి కైంకర్యాలు, నిత్య రుద్రహవన పూజలు స్మార్త సంప్రదాయరీతిలో కొనసాగాయి. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.18,53,945 ఆదాయం సమకూరినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. స్వామిని సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. స్వయంభువులను ఆయన దర్శించుకోగా, ఈవో రామకృష్ణారావు స్వామివారి అభిషేకం లడ్డూ ప్రసాదాలు అందజేశారు.



నిత్యతిరుకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, వేం నరేందర్‌రెడ్డికి స్వామివారి ప్రసాదాలు అందజేస్తున్న ఈవో రామకృష్ణారావు

అడుగంటిన ఆశలు

నీళ్లు లేక..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆయకట్టు నానాటికీ తీసికట్టు

నాడు.. ఒకప్పుడు పాడి పంటలతో అలరారిన ప్రాంతాలు.. ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేసి అన్నపూర్ణగా పేరుతెచ్చిన పచ్చని పంట భూములు.. నాగార్జునసాగర్, ఎస్సారెస్పీ ఆయకట్టు కింద లక్షల ఎకరాలు సాగయ్యేవి.. ధాన్యంతో పాటు అన్నదాతకు ఉపాధిని, భవిష్యత్‌కు భరోసానిచ్చే బంగారు భూములు..

నేడు నీళ్లు లేక నెర్రెలు బారాయి.. బంగారు పంటలు పండించే భూముల్లో నీరందక ఎండిపోతున్న పంటలే దర్శనమిస్తున్నాయి.. బోర్ల మీద ఆశపెట్టుకున్న రైతు ఆ బోర్లెండి ప్రతి రోజూ కన్నీటి సాగు చేస్తున్నాడు.. ఒకప్పటి ఆయకట్టు ఇప్పుడు పచ్చని పంటల స్థానంలో ఎండిపోయి, జీవులకు మేతగా మారుతున్నాయి.. అన్నదాత గుండెల్లో ఆందోళన సాగు కొనసాగుతూనే ఉంది..

కోదాడ రూరల్: కోదాడ మండలంలో నీళ్లు లేక నాగార్జునసాగర్ ఆయకట్టులో వరి చేలు ఎండిపోతున్నాయి. పంటలకు పెట్టిన వేల రూపాయల పెట్టుబడులు కళ్లముందే ఆవిరవుతుంటే రైతు కన్నీటి పర్యంతం అవుతున్నాడు. బావులు, బోర్లు, చెరువుల్లో కూడా నీరు ఇంకి పంట చేతికొచ్చే అవకాశం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఎడమకాల్వ కింద సుమారు 10 వేల ఎకరాలకు పైగా వరి సాగు చేశారు. పంట పొట్టదశకు వచ్చే సరికి భూగర్భజలాలు క్రమేణా తగ్గిపోయాయి. మండలంలోని నల్లబండగూడెం, రెడ్లకుంట, దోరకుంట, కాపుగల్లు, గణపవరం, రామలక్ష్మీపురం, కూచిపూడి, తొగర్రాయి, గుడిబండ గ్రామాల్లో రైతులు బోర్లు, బావుల కింద కొద్దోగొప్పో వరి సాగు చేశారు. కాల్వకు నీరు విడుదల చేయలేకపోతారా, పంట చేతికి రాకుండా పోతుందా అన్న ఆశతో సాగు చేసిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

నీళ్ల నుంచి పొలాల్లోకి.. దారిమళ్లిన మొసలి..


సాగర్‌లోకి మొసలిని వదిలిన అధికారులు

త్రిపురారం : నల్లగొండ జిల్లా త్రిపురారంలో పొలాల్లోకి వచ్చిన మొసలిని సాగర్ రిజర్వాయర్‌లో వదిలిపెట్టారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. త్రిపురారం మండలకేంద్రంలోని రైతు కోడి నాగయ్య గురువారం పొలానికి ఉదయం ఆరు గంటలకు వెళ్లాడు. పంట చేను పడిపోయి చూసి వెతకగా అక్కడ మొసలి కనిపించింది. ఇదే విషయాన్ని గ్రామస్థులతో పాటు పోలీసు, అటవీ శాఖ అధికారులకు తెలిపాడు. అటవీ శాఖ రెస్క్యూ టీం సహాయంతో మొసలిని తాళ్లతో బంధించి ట్రాలీ వాహనంలో నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు తరలించారు. పొలంలో గుర్తించిన మగ మొసలి వయస్సు ఐదేళ్లు ఉంటుందని, రెండు క్వింటాళ్ల బరువు ఉంటుందని మిర్యాలగూడ అటవీ రేంజ్ అధికారి అనంతరెడ్డి తెలిపారు. నాగార్జునసాగర్ కాల్వల ప్రవాహంలో మొసలి చిన్నపిల్లగా ఉన్నపుడే త్రిపురారం నల్లచెరువుకు చేరుకుందని భావిస్తున్నారు. ఈ ఏడాది తీవ్ర కరువు పరిస్థితులతో చెరువు దాని కింద ఉన్న బావులు పూర్తిగా ఎండిపోయాయి. ఎండిన చెరువు నుంచి సమీపంలోని పొలాల్లోకి మొసలి వెళ్లింది. పట్టుకుని సాగర్‌లో వదిలివేయడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు.


మిర్యాలగూడ మండలంలో ఎండుతున్న పంటలో మేస్తున్న పశువులు

మిర్యాలగూడ రూరల్: నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో ఎడమకాల్వ కింద సాగు నీరందక బోర్లుబావుల ఆధారంగా రైతులు వరి పంట సాగు చేశారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలో సాగు విస్తీర్ణం 41955 ఎకరాలు కాగా సాగర్ ఎడమకాల్వ ఆధారంగా మేజర్లు, చెరువులను నింపుకుని, కుంటల ఆధారంతో అధికంగా వరిసాగు చేపడుతారు. ప్రస్తుతం కేవలం బోరుబావుల ఆధారంగా 26,930 ఎకరాల్లో పంట సాగు చేపట్టారు. వరి 26,776 ఎకరాలు, మినుము 68 ఎకరాలు, అలసంద 12 ఎకరాలు, పెసర్లు 37 ఎకరాలు, ఉలవలు 11 ఎకరాలు, జొన్న 6, మొక్కజొన్న 2, వేరుశనగ ఎకరం, కూరగాయలు 18 ఎకరాల్లో పంట సాగు చేపట్టారు. రైతులు సాగునీరు అందే పరిస్థితులు లేవని సొంత ఖర్చులతో బోర్లు వేసుకుకన్నారు. వాతావరణ పరిస్థితులతో పాటు కుంటలు, చెరువుల్లో నీరు లేకపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. మిర్యాలగూడ మండలంలోని ముల్కలకాల్వ, రాయినిపాలెం, ఆలగడప, జాలుబాయితండా, ఐలాపురం, కాల్వపల్లి తదితర గ్రామాల్లో బోరుబావుల నుంచి వచ్చే నీటితో వరిసాగు చేపట్టారు. నీటితడి సరిపోక వందల ఎకరాల్లో వరి పంట ఎండిపోయింది.

పశుగ్రాసంగా పంట

వరి పంట చేతికి అందేది కష్టమనే తరుణంలో పంటను మధ్యలోనే పశుగ్రాసంగా మార్చుకోవాల్సి వచ్చిందని రైతులు అంటున్నారు. ఎకరాకు రూ.25వేల పెట్టుబడి పెట్టి పూర్తిస్థాయిలో నష్టపోవడం బాధాకరమని, ప్రభుత్వం ఎండిన పంటను గుర్తించేలా చర్యలు తీసుకోని నష్టపరిహారం అందేలా కృషి చేయాలని పలువురు రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

8 ఎకరాల్లో సాగు చేశా



ఎనిమిది ఎకరాల్లో వరి సాగు చేశా. చివరి దశలో ఒక్క తడికి నీరు అందకపోవడంతో పంట పూర్తిస్థాయిలో ఎండిపోయింది. బోర్లు వేసినా ఫలితం లేకుండా పోయింది.

● లక్ష్మీనర్సయ్య(రైతు, ముల్కలకాల్వ)

దేవరకొండ డివిజన్‌లో తగ్గిన వర్షపాతం


చందంపేట, నేరేడుగొమ్ము మండలాలకు నీరు సరఫరా అయ్యే కాల్వ

దేవరకొండ : నల్లగొండ జిల్లా దేవరకొండ డివిజన్‌లో వేసవి ప్రారంభంలోనే కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవక బోర్లు, బావుల్లో భూగర్భజలాలు అడుగంటాయి. అరకొరగా సాగు చేసిన వేరుశనగ పంట ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లోనూ నీటిమట్టం గణనీయంగా తగ్గుతోంది. ఏఎమ్మార్పీ ప్రాజెక్టు తాగునీటికే పరిమితమైంది. దేవరకొండ డివిజన్‌లో గతేడాది జనవరిలో 0.1 మిల్లీమీటర్ల వర్షం పడగా 19.1 మిల్లీమీటర్లు సాధారణ వర్షాపాతం నమోదైంది. ఈ ఏడాది జనవరిలో దేవరకొండ డివిజన్‌లో 0.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా సాధారణ వర్షపాతం 19.1 మిల్లీమీటర్లు నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది డివిజన్ పరిధిలోని చందంపేట, నేరేడుగొమ్ము, దేవరకొండ, చింతపల్లి, డిండి మండలాలలో 60 వేల ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశారు. డిండి ప్రాజెక్టు నీటి మట్టం 36 అడుగులు కాగా ప్రస్తుతం 33 అడుగులమేర నీరు నిల్వఉంది. ప్రతి ఏడాది డిండి ప్రాజెక్టు నీటిని వేసవిలో కాల్వల ద్వారా చందంపేట, నేరేడుగొమ్ము మండలాల్లోని చెరువులు, కుంటలకు విడుదల చేసి తాగునీటి సమస్య తలెత్తకుండా చూసేవారు. ఈ ఏడాది కూడా డిండి ప్రాజెక్టులో నీరు ఉన్నందున చందంపేట, నేరేడుగొమ్ము మండలాల్లోని 26 చెరువులను నింపి పశువులతో పాటు తాగునీటికి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

బోరు, బావుల్లో నీళ్లు తగ్గుతున్నాయి

వర్షాలు లేక బోరు, బావుల వద్ద భూగర్భజలమట్టం తగ్గుముఖం పట్టింది. రెండు ఎకరాల్లో వేరుశనగ పంట వేస్తే నీరులేక ఎకరం వరకు ఎండు దశకు చేరుకుంది. డిండి ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదల చేసి సమస్యను పరిష్కరించాలి.

● జబ్బు సత్తయ్య, రైతు, చందంపేట

బోరుమోటార్లతో భగీరథ ప్రయత్నాలు


నీళ్లు పడని బోరును చూపిస్తున్న రైతు విములయ్య

ఈయన పేరు ఆల్లె విములయ్య, యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం చిన్నపడిశాల గ్రామం. ఆయనకున్న రెండు ఎకరాల్లో వరి సాగు చేశాడు. రెండో బోర్లు, ఒక బావి ఉన్నా తక్కువగా నీరు పోస్తుండటంతో పంటను కాపాడుకునేందుకు మరో రెండు బోర్లు వేశాడు. నీరు రాకపోగా, సుమారు రూ.లక్ష వరకు ఖర్చు వచ్చింది. పంట పొట్ట దశలో ఉన్న ఎకరం పంట ఎండిపోతోంది. ఈ దఫా వరి సాగు చేస్తే నష్టమే మిగిలిందని రైతు వాపోయాడు.

● అడ్డగూడూరు

ఎస్సారెస్పీ పరిధిలో తెగులు.. దిగులు

పెన్‌పహాడ్ : సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలో భూగర్భ జలాలు అడుగంటి వరి పంటలు ఎండిపోతున్నాయి. అదేవిధంగా చీడపీడలతో పంటలు దెబ్బతింటున్నాయి. మండల వ్యాప్తంగా సుమారుగా 22,700 ఎకరాల్లో వరి సాగు చేసినట్లు అంచనా. ఎస్సారెస్పీ ఆయకట్టులో పెన్‌పహాడ్ మండలం చివరిది. ఈ సీజన్‌లో నీరందక సుమారు ఎనిమిది వేల ఎకరాలకు పైగా వరి పంట ఎండిపోయింది. బోర్‌మోటర్లు, బావులను ఆధారంగా చేసుకుని వరి పంటను సేద్యం చేస్తున్నారు. వేసిన కొద్దిపాటి పంటలు కూడా తెగుళ్ల బారిన పడ్డాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెగుళ్ల విషయమై వ్యవసాయాధికారులకు తెలిపిన పట్టించుకోలేదని రైతులు ఆరోపించారు.



బోర్‌మోటార్లు, బావి ఉన్నా ప్రయోజనం లేదు



మూడు బోర్ మోటర్లు, ఒక బావి ఉందనే ఆశతో 10 ఎకరాల్లో వరి సాగు చేశా. భూగర్భ జలాలు అడుగంటి పొట్టదశలోని రెండు ఎకరాల వరి పంట పూర్తిగా ఎండింది. బోర్ మోటర్ల నుంచి వస్తున్న కొద్దిపాటి నీటితో పంటకు వరస తడులు పెడుతున్నాం. ఎండిపోయిన పంటను అధికారులు పరిగణలోకి తీసుకోవాలి. పంటకు పెట్టిన పెట్టుబడి వచ్చే అవకాశం లేదు.

● బొలిశెట్టి భిక్షమయ్య, నాగులపాటి అన్నారం, పెన్‌పహాడ్

ఎండిన పంటలను నమోదు చేయం

ఎండిపోయిన పంటల వివరాలను నమోదు చేయలేం. ఉన్నతాధికారుల నుంచి నమోదు చేయాలన్న ఆదేశాలు లేవు. వారి ఆదేశాల లేకుండా ఎలా నమోద చేస్తాం. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వస్తే సర్వే చేసి ఎండిన పంటల వివరాలు సేకరిస్తాం. ఏఈవోలు రైతువేదికల వద్ద అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటా. రైతులకు సలహాలు, సూచనలు చేస్తున్నాం.

● కృష్ణ సందీప్, ఏవో

ఆర్య సమాజం.. శతవసంతం


జయంతి ఉత్సవాలకు ఏర్పాటు చేసిన వేదిక

నల్లగొండ /నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 29 : నల్లగొండ జిల్లా కేంద్రంలో ఆర్య సమాజం ఏర్పాటై వందేళ్లు అయ్యింది. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నారు. 1875 ఏప్రిల్ 10న మహారాష్ట్ర రాజధాని ముంబాయిలో మహర్షి దయానంద సరస్వతి ఆర్య సమాజాన్ని స్థాపించారు. హిందూ ధర్మాన్ని అన్ని మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా, వేదాలకు దగ్గరగా తీసుకెళ్లడమే ఆర్యసమాజం ముఖ్య ఉద్దేశ్యం. ఇది ఏర్పడిన 50 ఏళ్లకు 1924లో నల్లగొండ జిల్లా కేంద్రంలోని షేర్‌బంగ్లాలో ఆర్య సమాజాన్ని ప్రారంభించారు. కొమర్రాజు కోటేశ్వరరావు నల్లగొండలో ఆర్య సమాజాన్ని నడిపించడంలో గొప్పపాత్ర పోషించారు. నల్లగొండకు చెందిన బలిజ బొంతయ్యను హరిద్వార్ పంపి సంస్కృతం, వేదాలు నేర్పించి పండిత భద్రదేవ్‌గా నల్లగొండలో ఆర్య సమాజ కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. ఆర్య సమాజం ఆధ్వర్యంలో గ్రంథాలయం స్థాపించి పుస్తక పఠనానికి అవకాశం కల్పించారు. ఆడపిల్లలకు స్కూల్ నడిపించేవారు. చదువుతో పాటు కర్రసాము, కత్తిసాము కూడా నేర్పేవారు. పండిత భద్రదేవ్, మాత వేదవతిలు కలిసి అనేక కార్యక్రమాలు చేశారు. 1938లో ఆల్ ఇండియా ఆర్య సమాజ్ సమావేశం నల్లగొండలో పెద్దఎత్తున నిర్వహించారు. 1965లో బాలికల పాఠశాల కోసం చందాలు పోగు చేసి గదులు నిర్మించారు. మొదట నిర్మించిన భవనాన్ని గవర్నమెంట్ బాలుర ఉన్నత పాఠశాల కోసం ఇచ్చారు. తరువాత నిర్మించిన భవనాన్ని గవర్నమెంట్ బాలికల ఉన్నత పాఠశాలకు ఇచ్చారు. నల్లగొండ పట్టణానానికి చెందిన దోమలపల్లి యాదగిరిరావు ఆర్యసమాజ భవనం కోసం ఆర్యసమాజం ఆధ్వర్యంలో పేదలకు విద్యనందించేందుకు భూమి కొనుగోలు చేసి భూదానం చేశారు. అదే భూమిలో నల్లగొండకు మేధావులను అందించిన రామగిరి బాలుర, బాలికల పాఠశాలలను ఏర్పాటుచేశారు. వెంకటనారాయణ ప్రెసిడెంట్‌గా ఉండగా రామగిరిలో ఆర్యసమాజం మందిరం నిర్మితమైంది. శ్రీ విశ్వామిత్ర, మాతల ఆధ్వర్యంలో పెళ్లిళ్లు, ఉపనయనాలు, సమావేశాలు, సత్సంగాల నిర్వహణ ప్రారంభమైంది. ఆ తర్వాత బీద పిల్లలకు 5వ తరగతి దాకా పాఠశాల, కరాటే, వారం వారం యజ్ఞం, సమావేశాలు నిర్వహించారు. నల్లగొండలో జరిగిన నిజాం విముక్తి పోరాటంలో ఆర్య సమాజ్ ముందు వరుసలో నిలిచింది. జిల్లాలోని ప్రముఖ కమ్యూనిస్టు యోధులైన ధర్మభిక్షం కూడా ఆర్యసమాజం బాధ్యులుగా ఉన్నారు. నల్లగొండలో ప్రతీ దసరాకు షేర్ బంగ్లా ఆర్య సమాజం నుంచి రామగిరి ఆర్యసమాజం మందిరం దాకా ఒక నగర ప్రముఖుడిని గుర్రంపై ఆశీనులు చేయించి శోభాయాత్ర నిర్వహిస్తారు.అదొక గొప్ప వేడుకగా నిలిచింది.

నేటి నుంచి శతజయంతి ఉత్సవాలు

నల్లగొండ ఆర్యసమాజ్ స్థాపించి వందేళ్లయిన సందర్భంగా శత జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. మార్చి 1, 2, 3 తేదీల్లో మూడు రోజుల పాటు అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా స్వామి రాందేవ్‌బాబా హాజరుకానున్నారు. ఇదే సందర్భాన్ని పురస్కరించుకుని ఆర్య సమాజం వ్యవస్థాపకుడు మహర్షి దయానంద సరస్వతి ద్విశత జన్మ జయంతి వేడుకలను నిర్వహించనున్నారు. మహాసభల ప్రారంభం రోజున 200 కుండాలలో జరుపతలపెట్టిన చరిత్రాత్మకమైన మహాయజ్ఞంలో స్వామి ప్రణావానంద సరస్వతి పాల్గొననున్నారు.

భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిచ్చేలా కార్యక్రమాలు

ఏ విలువల కోసమైతే ఆర్యసమాజం ఏర్పడిందో దాన్ని కొనసాగిస్తూ ప్రజలకు సేవలందిస్తున్నాం. ఆర్యసమాజం ఏర్పడి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మహర్షి 200 జయంతి సందర్భంగా 200 కుండాలలో మహాయజ్ఞం నిర్వహిస్తున్నాం. భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిచ్చేలా ఈ కార్యక్రమాలుంటాయి. నల్లగొండలో మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను ప్రజలు విజయవంతం చేయాలి.

● బోయపల్లి కృష్ణారెడ్డి, ఆర్యసమాజం అధ్యక్షుడు

సులభంగా డబ్బు సంపాదించాలని చోరీలు


అంతర్రాష్ట్ర దొంగల అరెస్టుకు సంబంధించిన వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 29 : సులభంగా డబ్బులు సంపాదించేందుకు పార్కింగ్ చేసిన వాహనాల అద్దాలు పగులగొట్టి చోరీకి పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి కారుతో పాటు రూ.2.77 లక్షల నగదు, కారు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు వెల్లడించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా బోగోల్ మండలం కప్రాలపల్లి గ్రామానికి చెందిన పిట్ల మహేష్ వృత్తిరీత్యా కేబుల్ ఆపరేటర్, అదే గ్రామానికి చెందిన ఆవుల రాజేష్ మేస్త్రీగా పనిచేసేవాడు. సులభంగా డబ్బులు సంపాదించేందుకు వారిద్దరూ కలిసి దొంగతనాలను ఎంచుకున్నారు. ఇందు కోసం పార్కింగ్ చేసిన వాహనాలను లక్ష్యంగా చేసుకున్నారు. ప్రత్యేక పరికరాలతో ఏమాత్రం అనుమానం రాకుండా వాహనం అద్దాలను తొలగించి అందులో ఉన్న నగదు, ఇతర వస్తువులను దొంగిలించేవారు. ఈ క్రమంలోనే నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం చిన్నగుడెం గ్రామానికి చెందిన రావుల శంకర్ ఈ ఏడాది జనవరి నెల 30న టాటా ఏస్ వాహనంలో తన గొర్రెలను మిర్యాలగూడ మండలంలోని అవంతీపురం మార్కెట్‌లో విక్రయించి వచ్చిన డబ్బులను వాహనంలోని డిక్కీలో ఉంచి హోటల్‌కు వెళ్లాడు. తిరిగివచ్చి చూసే సరికి వాహనం గ్లాస్ పగలగొట్టి ఉంది. దీనితో పాటు అందులో దాచిన నగదు రూ.97వేలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఇదిలా ఉండగా గురువారం తెల్లవారుజామున కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారి(167)పై మిర్యాలగూడ పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఎర్టిగా కారులో ప్రయాణిస్తూ అద్దాలను పగలగొట్టేందుకు ఉపయోగించే పరికరాలతో అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తులను అదుపులోకి విచారణ చేయగా, గత నేరాలను ఒప్పుకున్నారు. వీరిపై గతంలో మిర్యాలగూడ వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదుకాగా వారి నుంచి రూ.2.77 లక్షల నగదు, కారు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా ఈ ముఠాలో వీరితో పాటు మరికొందరు కూడా ఉన్నట్లు అనుమానిస్తున్నామని, వీరిపై రాష్ట్రంలోనే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లో కూడా కేసులు నమోదై ఉండే అవకాశం ఉన్నందున రిమాండ్ అనంతరం నిందితులిద్దరిని కస్టడీకి తీసుకుని విచారించనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు, ఎస్ఐ సతీష్, పీసీలు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనావాస్, కే సైదులు పాల్గొన్నారు.

ఎన్‌జీఎస్ కంపెనీ ఏర్పాటుకు ప్రజల మద్దతు



ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరావు

మఠంపల్లి, ఫిబ్రవరి 29 : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని సుల్తాన్‌పురతండాలో ఏర్పాటుచేయనున్న ఎన్‌జీఎస్ వైట్‌పరిశ్రమ ఏర్పాటుకు ప్రజామోదం లభించింది. గురువారం జిల్లా కలెక్టర్ వెంకటరావు అధ్యక్షతన నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు, వక్తలు సంపూర్ణ మద్దతు తెలిపారు. తమిళనాడు చెందిన పరిశ్రమ యాజమాన్యం ఎన్‌జీఎస్ వైట్ సిమెంట్ మిక్సింగ్ ప్లాంటు రోజుకు 200 టన్నుల ఉత్పత్తి చేస్తుందని, ముడి సరుకులు, కంకర్‌ను అరబ్, మలేషియా, దుబాయి ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్నట్లు ప్రకటించారు. దేశంలో రాజస్థాన్‌లో ఎక్కువ వైట్‌పరిశ్రమలు ఉంటాయని, సున్నపురాయిని మఠంపల్లి మండలంలోని రఘునాథపాలెం, గుండ్లపల్లి ప్రాంతాల నుంచి తీసుకుంటున్నట్లు కంపెనీ యజమాన్యం ప్రకటించింది. పూర్తి కాలుష్య రహితంగా పరిశ్రమ ఉంటుందని వెల్లడించారు. అనంతరం మాట్లాడిన ప్రజాప్రతినిధులు, వక్తలు, ప్రజలు పరిశ్రమ నిర్మాణానికి స్వాగతిస్తున్నామని, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, మొక్కలు పెంచాలని సూచించారు. ప్రజాభిప్రాయ సందర్భంగా యాజమాన్యం ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేయాలని కోరారు. మొత్తం 46మంది అభిప్రాయం వ్యక్తం చేశారు. నలుగురు మినహా మిగతా వారందరూ పరిశ్రమ ఏర్పాటుకు మద్దతు తెలిపారు. పర్యావరణ నిబంధనలు పాటించి, హామీలను తప్పనిసరిగా అమలు చేస్తామని కంపెనీ యాజమాన్యం ప్రకటించింది. పరిశ్రమ నిర్మాణ ప్రారంభంలో 25మంది కంపెనీ ఉద్యోగులుతో పాటు మరో 50మంది కాంట్రాక్ట్ కార్మికులకు అవకాశాలు ఉంటాయని, పూర్తయిన తరువాత 40మంది కంపెనీ ఉద్యోగులు, 50మంది కాంట్రాక్ట్ ఉద్యోగ అవకాశాలతో పాటు పరోక్షంగా వందలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తుందని తెలిపారు.

540 సర్వే నెంబరుపై గ్రామసభ ఏర్పాటు చేస్తా: కలెక్టర్ వెంకటరావు

మండలంలోని పెదవీడు రెవెన్యూలోని సర్వే నెంబరు 540లో నెలకొన్న వివాదాల పరిష్కారానికి త్వరలో గ్రామసభ ఏర్పాటు చేసి వాస్తవ, అవాస్తవాలపై విచారణ చేసి సమస్య పరిష్కరిస్తామని కలెక్టర్ వెంకటరావు అన్నారు. ప్రభుత్వ నూతనంగా తీసుకువస్తున్న మాభూమి పథకం ద్వారా సర్వే నెంబరుపై ప్రత్యేక దృష్టి సారించి, నిరుపేద అర్హులైన రైతులకు న్యాయం చేస్తామన్నారు. కంపెనీ ఏర్పాటుపై అభిప్రాయసేకరణలో 46 మంది ప్రత్యక్షంగా అభిప్రాయాలను తెలిపారని, 75 మంది రాతపూర్వకంగా, మరో ఆరుగురు ఈ మెయిల్ ద్వారా అభిప్రాయాలను వ్యక్త చేశారని కలెక్టర్ తెలిపారు. చిన్న చిన్న పరిశ్రమల ఏర్పాటుకు స్వాగతిస్తున్న ఈ ప్రాంత ప్రజలు అభివృద్ధి కాముకులని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో పర్యావరణ శాఖ ఉమ్మడి జిల్లా ఈఈ సురేష్‌బాబు, అదనపు ఎస్పీ నాగేశ్వరావు, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐలు చరమందరాజు, రామకృష్ణారెడ్డి, వైట్ పరిశ్రమ ఎండీ నారాయణన్, నాయకులు సాముల శివారెడ్డి, జడ్పీటీసీ జగన్‌నాయక్, భూక్యమంజూనాయక్, తహసీల్దార్ మంగారాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి


చందు(ఫైల్‌ఫొటో)

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 29 : ఇసుక ట్రాక్టర్ పల్టీకొట్టి డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో గురువారం జరిగింది. ఎస్ నాగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలకేంద్రానికి చెందిన గట్టు చందు(25) ఇసుక ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం కామునిగూడెం బిక్కేరు వాగు నుంచి ట్రాక్టర్‌లో ఇసుకను మండల కేంద్రంలో దించాడు. ఖాళీ ట్రాక్టర్‌తో వాగులోకి వెళ్తున్న క్రమంలో బూనాదిగాని కాల్వ గట్టు మీద ట్రాక్టర్‌ను అతివేగంగా నడపడంతో అదుపుతప్పి కాల్వలోకి పల్టీకొట్టింది. చందుపైన ట్రాక్టర్ ఇంజన్ పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చందుకు భార్య కావ్య, రెండేళ్ల కుమార్తె సహస్ర ఉన్నారు. భార్య కావ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారు ఢీకొని...

హాలియా: నల్లగొండ జిల్లా హాలియా మండలంలో కారు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ సతీష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నిడమనూరు మండలం ఉట్కూరు గ్రామానికి చెందిన నర్సింగ్ శేఖర్(36), నర్సింగ్ రాములు శేరిలింగోటం వద్ద శుభకార్యానికి వెళ్లి బైక్‌పై స్వగ్రామానికి వస్తున్నారు. అర్ధరాత్రి నల్లగొండ నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో నర్సింగ్ శేఖర్ అక్కడికక్కడే మృతి చెందారు. రాములుకు తీవ్రగాయాలయ్యాయి. రాములు ప్రస్తుతం మలకపేట యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శేఖర్ సోదరుడు పాపయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బస్సు ఢీకొని...

బీబీనగర్: యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలం ముగ్దుంపల్లి గ్రామసమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన మేకల శివప్రసాద్(22) చిన్నరావులపల్లిలోని హిందుస్థాన్ కంపెనీలో పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని స్వగ్రామం గొల్లగూడెం వస్తుండగా ముగ్దుంపల్లి గ్రామ సమీపంలో మూలమలుపు వద్ద భువనగిరి నుంచి శివారెడ్డిగూడెం గ్రామానికి వెళ్తున్న యాదగిరిగుట్ట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో తలకు బలమైన గాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు.

ఆటో బోల్తా, ముగ్గురికి గాయాలు

కోదాడ రూరల్ : సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలో కూలీలు ప్రయాణిస్తున్న ఆటో పల్టీకొట్టిన ఘటనలో ముగ్గురు మహిళలు గాయపడ్డారు. చిమిర్యాల నుంచి మిరప పంట ఏరేందుకు కూలీ కోసం ఖమ్మం జిల్లా నేలకొండపల్లికి ఆటోలో వెళ్తున్నారు. చిమిర్యాల క్రాస్‌రోడ్డు వద్ద సడన్ బ్రేక్ వేయడంతో ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటో ప్రయాణిస్తున్న షేక్ లాల్‌బీ, మస్తానమ్మ, అచ్చమ్మ తీవ్రగాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఆటోలోని మరో ఏడుగురికి స్వల్పగాయాలయ్యాయి.

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు


విజయరాఘవాపురంలో అంతిమయాత్ర

మునగాల, ఫిబ్రవరి 29 : సూర్యాపేట జిల్లా మోతె మండల కేంద్రంలో బుధవారం జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కూలీలకు గురువారం అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు పూర్తయ్యాయి. మండలంలోని విజయరాఘవాపురం గ్రామానికి చెందిన నలుగురు కూలీలు మృతి చెందడంతో కాలనీ మొత్తం కన్నీటి పర్యంతమైంది. కందుల నాగమ్మ, గురువయ్య దంపతులు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఒకేసారి ఇద్దరికి కుమారుడు తలకొరివి పెట్టటంతో ప్రతి ఒక్కరూ కంటతడిపెట్టారు. కాలనీలో అందరితో కలివిడిగా ఉంటూ కూలీనాలీ చేసుకుని జీవించే వారు మృత్యువాతపడటం అందరినీ కలిచివేసింది. బుధవారం అర్ధరాత్రి చెవుల నారాయణమ్మను, రెమిడాల సౌభాగ్యమ్మ అంత్యక్రియలు నిర్వహించారు. పేద కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

ఆస్తి పన్ను బకాయిల వసూళ్లకు ప్రణాళిక

● బకాయి ఆస్తిపన్ను చెల్లింపుపై వన్‌టైం సెటిల్మెంట్ ఆఫర్ ● ఈ నెల 31వ తేదీ లోపు చెల్లిస్తే 90శాతం అపరాధ రుసుము మాఫీ



భువనగిరి మునిసిపల్ కార్యాలయం

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 29: పట్టణాల్లో పేరుకుపోయిన ఆస్తి పన్నుల బకాయిలు రాబట్టి మునిసిపాలిటీలకు ఆర్థిక పరిపుష్టి కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం వన్‌టైం సెటిల్మెంట్ అవకాశం ప్రకటించింది. మార్చి 31వ తేదీ లోపు బకాయి ఆస్తిపన్ను మొత్తం చెల్లిస్తే 90శాతం అపరాధ రుసుము మాఫీ వర్తిస్తుందని పేర్కొంది. ఈ మేరకు గత నెల 28న జీవో నెం.101ను ప్రభుత్వం విడుదల చేసింది. భువనగిరి మునిసిపాలిటీలో వన్‌టైం సెటిల్మెంట్ ఆఫర్ 6,069 మందికి వర్తించనుంది. బకాయి ఆస్తిపన్ను నుంచి రూ.3,73,44,000 ఆస్తిపన్ను రావాల్సి ఉన్నది. ప్రభుత్వం ప్రకటించిన వన్‌టైం సెటిల్మెంట్ ఆఫర్‌ను బకాయిదారులు సద్వినియోగం చేసుకుంటే మునిసిపాలిటీకి కాసుల పంట పండనుంది. ఆస్తిపన్ను కాగా మునిసిపాలిటీలో 14,651 అసిస్మెంట్స్ ఉండగా ఆస్తిపన్ను డిమాండ్ రూ.8,77,86,000గా ఉంది. కానీ ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో 30 రోజులు మాత్రమే గడువు ఉండగా ఇప్పటి వరకు కేవలం రూ.3,55,23,000 వసూలు కాగా రూ.5,22,41,000 రావాల్సి ఉంది. ఈ మేరకు ఆస్తిపన్ను వసూళ్ల కోసం మునిసిపల్ అధికారులు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి రోజువారీగా వసూళ్లను పర్యవేక్షిస్తున్నారు. గడువు లోపు 100శాతం పన్నులను వసూళ్లు చేసేందుకు కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రకటించిన 90శాతం అపరాధ రుసుము మాఫీ బకాయి పన్నుల చెల్లింపు నకు ప్రోత్సాహంగా మారుతుందని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల బకాయిలను కూడా వసూలు చేసేందుకు సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు లేఖలు రాసే యోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు

ఆస్తి పన్ను చెల్లింపులో ప్రభుత్వ కార్యాలయాలతో పోలిస్తే ప్రజలే పన్ను చెల్లింపులో చిత్తశుద్ధి చూపుతుండడం విశేషం. పట్టణంలో 14,651 ప్రైవేట్ అసిస్మెంట్స్ నుంచి ప్రస్తుతం ఆర్థిక సంవత్సరానికి ఏరియర్స్, కరెంట్ ఆస్తి పన్ను డిమాండ్ రూ.8,77,86,000గా ఉన్నది. కానీ ఇప్పటి వరకు సుమారు 60శాతం పన్ను వసూలైనట్లు అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాల నుంచి మాత్రం ఆస్తిపన్ను చెల్లింపు కావడం లేదని తెలుస్తోంది. పట్టణంలోని 76 ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.1,87,69,000 డిమాండ్ ఉండగా ఇప్పటి వరకు కేవలం రూ.12.88 (6.86శాతం)లక్షలు మాత్రమే వసూలయ్యాయి. మిగితా రూ.1.74 కోట్లు వసూలు కావాల్సి ఉన్నది. సంబంధిత అధికారులు మాత్రం ప్రభుత్వం గ్రాంట్ విడుదల చేస్తేనే ఆస్తిపన్ను చెల్లింపు సాధ్యమవుతుందని పేర్కొంటున్నారు.

24 గంటల వైద్యం హుళక్కే

● పేరుకే 24గంటల ఆస్పత్రి.. సేవలు కొన్ని గంటలే ● అందుబాటులో ఉండని వైద్యులు ● ఆస్పత్రిలో సిబ్బంది కొరత

యాదగిరిగుట్ట రూరల్, ఫిబ్రవరి 29: ప్రముఖ పుణ్య క్షేత్రం యాదగిరిగుట్ట పట్టణంగా విస్తరిస్తున్నా వైద్య సేవలు నామమాత్రంగానే అందుతున్నాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వైద్య సౌకర్యములు అందకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు రాకపోకలు సాగించే గుట్టలో కనీస ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులో లేవు. యాదగిరిగుట్ట ప్రాథమిక కేంద్రంలో సిబ్బంది కొరత ఉంది. మెడికల్ ఆఫీసర్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఏఎన్‌ఎంలు, పారిశుధ్య సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పేరుకు మాత్రమే 24గంటల ఆసుపత్రి అయినా ఉన్న డాక్టర్ కేవలం ఏడు గంటలు మాత్రమే అందుబాటులో ఉంటారు. ప్రస్తుతం మెడికల్ ఆఫీసర్ ఒక్కరే ఉన్నారు. మరొకరు పదోన్నతిపై జిల్లాకేంద్రానికి వెళ్లారు. వారంలో రెండు రోజులు వచ్చివెళ్తుంటారు. ప్రస్తుత మెడికల్ ఆఫీసర్ హైదరాబాద్ నివాసముంటారు. డాక్టర్లు అం దుబాటులో ఉండరు. ఆసుపత్రిలో కేవలం ఆరు పడకలే ఉన్నాయి. రెండు నెలల నుంచి పీహెచ్‌సీలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు పూర్తిగా నిలిపివేశారు. ప్రసవం కోసం వచ్చే మహిళలను జిల్లాకేంద్ర ఆసుపత్రికి పంపిస్తున్నారు. ఆసుపత్రిలో జనరేటర్ సౌకర్యం లేకపోవడంతో కరెంట్ పోతే కష్టాలు తప్పడం లేదు. పారిశుధ్య సిబ్బంది లేకపోవడంతో ఆస్పత్రి అపరిశుభ్రంగా ఉంది. సాయంత్రం నాలుగు గంటలు దాటితే మెడికల్ ఆఫీసర్ ఉండకపోవడంతో కేవలం ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఏఎన్‌ఎంలతో సేవలు కొనసాగుతున్నాయి. అత్యవసర సేవలు లేకపోవడం, తాగునీరు కూడా లేకపోవడంతో రోగులకు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. షుగర్, బీపీ మందులు కూడా అందుబాటులో లేవని రోగులు పేర్కొంటున్నారు. గర్భిణులకు నమోదుకార్డులు కూడా లేవు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై పాలకులు దృష్టి సారించి సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మెడికల్ ఆఫీసర్ వివరణ ఇస్తూ తాను ప్రతిరోజూ హైదరాబాద్ నుంచి ఆస్పత్రికి వచ్చి ఏడు గంటల పాటు ఉండి వైద్య సేవలు అందించి తిరిగి వెళ్తానని చెప్పారు. మిగితా సమయాల్లో స్టాఫ్ నర్సులు, ఏఎన్‌ఎంలు సేవలు అందిస్తారన్నారు.



యాదగిరిగుట్టలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది స్థానికంగానే ఉండాలి



నిత్యం వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు వస్తుంటారు. మెడికల్ ఆఫసీర్లు సిబ్బంది లేకపోవడంతో స్థానిక ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఆఫీసర్లు విఫలమవుతున్నారు. ప్రతిరోజు హైదరాబాద్ నుంచి కేవలం 6,7 గంటలు సేవలు చేసి వెళ్తుండడంతో రోగులు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం స్పందించి ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు, సిబ్బందిని నియమించాలి. 24 గంటలు వైద్యసేవలు అందించాలి.

● బబ్బూరి పోశెట్టి, సీపీఎం మండల కార్యదర్శి.

'రాయితీని సద్వినియోగం చేసుకోవాలి'

మోత్కూరు, ఫిబ్రవరి 29: మునిసిపాలిటీలో ఆస్తి పన్ను బకాయిలు ఒకేసారి చెల్లిస్తే వడ్డీపై ప్రభుత్వం 90శాతం రాయితీ ఇస్తుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మోత్కూరు మునిసిపల్ కమిషనర్ సి. శ్రీకాంత్ కోరారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. 2022-23 ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న ఇంటి పన్ను బకాయిలపై విధించిన వడ్డీలో 90శాతం వెంటనే మాఫీ చేస్తామన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బకాయిలు పూర్తిగా చెల్లిస్తే వడ్డీలో ఇవ్వాల్సి రాయితీ తదుపరి చెల్లించే ఇంటి పన్నులో తగ్గిస్తామన్నారు.

ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

భువనగిరి రూరల్, ఫిబ్రవరి 29: జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకి ఉపాధి హామీ పనులు కల్పించాలని ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ సమావేశపు హాల్‌లో గురువారం జరిగిన మండల ప్రత్యేక అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకం, వేసవి కాలంలో మంచినీటి సరఫరా, పీఎం విశ్వకర్మ పథకం తదితర కార్యక్రమాలపై గ్రామాల వారిగా సమీక్షించారు. సమావేశంలో తహసీల్దార్ అంజిరెడ్డి, సీడీపీవో స్వరాజ్యం, ఏవో పావని, ఏపీవో బాలస్వామి, ఈసీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



మోటకొండూరు పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

మోత్కూరు, మోటకొండూరు, ఫిబ్రవరి 29: మోత్కూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు గురువారం స్వపరిపాలన దినోత్సవం జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆర్.రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అరుణాదేవి, లలిత, సౌజన్య, జ్యోతి, రజిత, సత్తయ్య పాల్గొన్నారు. మోటకొండూరులోని సెయింట్ పీటర్స్ పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మీసాల రాజయ్య, కరస్పాండెంట్ కె. రవీందర్, నందాల వరలక్ష్మి, రాజేశ్వరి, రమణ, స్రవంతి, అశ్విని, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

భూములు కాపాడాలి

మోత్కూరు, ఫిబ్రవరి 29: రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ స్వలాభం కోసం మండలంలోని పొడిచేడు ఖుర్దు గ్రామంలో ఎస్సీల భూములను కొని, ఇతరులకు అమ్ముతున్నారని మండలంలోని దత్తప్పగూడెం గ్రామానికి చెందిన రైతు కంచర్ల యోగెందర్‌రెడ్డి కలెక్టర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. 2003లో భూమిలేని పేద రైతులకు ఇవ్వడానికి తాను తనకు పొడిచేడు ఖుర్దు గ్రామంలో సర్వేనంబర్లు 1, 2/ఎ, 285, 286, 287లలో ఉన్న 25 ఎకరాల 24 గుంటల భూమిని ఎస్సీ కార్పొరేషన్‌కు విక్రయించానన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఆ భూమిని 20 దళిత కుటుంబాలకు పంపిణీ చేసి, పట్టాలు ఇచ్చిందని తెలిపారు. 20 ఏళ్లుగా వారు అక్కడ వ్యవసాయం చేసుకుంటున్నారన్నారు. ఇటీవల రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆ భూములపై కన్నేసి, దళిత రైతులకు మాయమాటలు చెప్పి తక్కువ ధరకు వారి భూములు కొని, ఎస్సీ కార్పొరేషన్ నుంచి ఎన్‌వోసీ లేకుండానే ఇతరులకు అమ్మి మోత్కూరు తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారని ఆరోపించారు. వారు అడిగిన ధరకు భూములు ఇవ్వాలని బెదిరిస్తున్నారన్నారు. కొనుగోళ్లను వెంటనే ఆపాలని కోరారు. తనకు అక్కడ సర్వేనంబరు 296లో ఇంకా 6 ఎకరాల 15గుంటల భూమి ఉందని, అందులో కందిచేను వేశానన్నారు. భూమి అమ్మాలని రియల్ ఎస్టేట్ వ్యాపారులు తనను కూడా బెదిరించారని, అమ్మకపోవడంతో తన కంది చేనులో కొంత ఆక్రమించి రాతికడీలు పాతారని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మక విద్య : డీఈవో



భువనగిరిలో మాట్లాడుతున్న డీఈవో నారాయణరెడ్డి

భువనగిరి రూరల్, ఫిబ్రవరి 29: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు గుణాత్మక విద్య అందుతుందని డీఈవో డాక్టర్ కె. నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని అనంతరం జడ్పీ హైస్కూల్ వార్షికో త్సవంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య బోధన చేపడుతున్నట్టు తెలిపారు. అన్ని రంగాల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో చక్కటి ఫలితాలు సాధిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి బలోపేతం అయ్యేవిధంగా తోడ్పాటు అందించాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు సిహెచ్ రంగరాజన్, కే కృష్ణారెడ్డి, సామల వెంకటేష్, చిందం మల్లికార్జున్, షకీల్, కొండల్‌రెడ్డి, రాకల శ్రీనివాస్, విట్టల్ వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఎంపీపీ చీర శ్రీశైలం అన్నారు. మండలంలో వంగపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవంలో మాట్లాడారు. విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో జడ్పీటీసీ తోటకూరి అనురాధబీరయ్య, ఎంపీటీసీ మౌనిక, మాజీ సర్పంచ్ కానుగు కవితా బాలరాజ్‌గౌడ్, టీడీపీ జిల్లా నాయకుడు రేగు బాలనర్సయ్య, ప్రధానోపాధ్యాయడు ముత్తయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ది పోటీ చేయలేని దుస్థితి : బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ వైస్‌చైర్మన్ దశరథ

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 29: కొన్నిరోజులకు ముందు పాలకపక్షంగా ఉండి నేడు చైర్మన్, వైస్ చైర్మన్ స్థానాలకు పోటీ చేయలేని స్థితికి దిగజారిన బీఆర్‌ఎస్‌కు బీజేపీని విమర్శించే నైతికత లేదని మునిసిపల్ వైస్‌చైర్మన్ మాయ దశరథ అన్నారు. ఆ పార్టీ కౌన్సిలర్లు, నాయకులతో కలిసి గురువారం భువనగిరిలో విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. విపక్షాలతో కలిసి మున్సిపల్ అవిశ్వాస రాజకీయాలకు తెరలేపి సొంత పార్టీ చైర్మన్, వైస్ చైర్మన్‌లను గద్దె దింపిన ఘనత బీఆర్‌ఎస్‌ది అని విమర్శించారు. బుధవారం జరిగిన ఎన్నికల్లో బీజేపీ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు సొంతంగా పోటీ చేసి వైస్ చైర్మన్ స్థానాన్ని సాధించుకుందన్నారు. కౌన్సిల్‌లో అత్యధిక సభ్యులు గల బీఆర్‌ఎస్ ఎందుకు పోటీ చేయలేక పోయిందని, ఆ పార్టీ సభ్యులు ఏ పార్టీకి అమ్ముడుపోయారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఇతరులపై విమర్శలు మాని సొంత పార్టీని సరిదిద్దుకోవాలన్నారు. బీజేపీపై అసత్య ఆరోపణలు, విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. పట్టణ అభివృద్ధి లక్ష్యంగా బీజేపీ పనిచేస్తుందన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు రత్నపురం బలరాం, ఉదయగిరి విజయ్‌కుమార్, జనగాం కవిత, నాయకులు పడమటి జగన్మోహ న్‌రెడ్డి, చందా మహేందర్ గుప్తా, లక్ష్మీనారాయణగౌడ్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న మైనార్టీ సంక్షేమ అధికారి యాదయ్య


భువనగిరి టౌన్, ఫిబ్రవరి 29: మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి యాదయ్య అన్నారు. మైనార్టీ సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో భువనగిరిలో మైనార్టీ మహి ళలకు నిర్వహించిన ఉచిత టైలరింగ్, మగ్గం శిక్షణ ముగింపు సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. సుస్థిర భవిష్యత్తు కోసం ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు, కుట్టు, మగ్గం మిషన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వెంకట్, నర్సింగ్‌నాయక్, మహిళా సాధికారత కేంద్రం అధికారులు హర్ష, భార్గవి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల కోసం ప్రయత్నాలు

చౌటుప్పల్ టౌన్, ఫిబ్రవరి 29: చౌటుప్పల్ పట్టణంలోని పలు ప్రభుత్వ రంగ సంస్థలకు ఏర్పాటు చేయనున్న నామినేటెడ్ పదవుల కోసం కాంగ్రెస్ నాయకులు ఎదురు చూస్తున్నారు. ఈ నెల 10వ తేదీ తర్వాత వచ్చే పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ కంటే ముందుగానే రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పదవులను భర్తీ చేసేందుకు కసరత్తు చేస్తుంది. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ శ్రేణులు మరింత ఉత్సాహంగా పని చేసేందుకు స్థానికంగా ఉండే సంస్థలకు నూతన పాలకవర్గాలను నియమించాలని ఆ పార్టీ అధిష్టానం నిర్ణయించినట్టు తెలిసింది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సిఫారసు చేసిన పాలకవర్గాలనే ప్రభుత్వం ఆమోదించి ప్రకటిస్తుంది. ఆ క్రమంలోనే వారం రోజుల క్రితం స్థానిక సీతారామచంద్రస్వామి దేవస్థానానికి చైర్మన్ బొబ్బిళ్ల మురళి నాయకత్వంలో నూతన పాలకవర్గాన్ని ప్రభుత్వం ప్రకటించింది. మురళిని చైర్మన్ గా ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తమవుతుంది.

గ్రంథాలయ చైర్మన్, శ్రీ ధర్మశాల కమిటీ చైర్మన్, ఎలిమినేటి మాధవరెడ్డి షాదీఖానా చైర్మన్ పదవుల కోసం పలువురు కాంగ్రెస్ నాయకులు ఆశ పడుతున్నారు. ఈ పాలకవర్గాల్లో చైర్మన్ పదవితో పాటు మరో నాలుగు డైరెక్టర్ పదవులు ఉంటాయి. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఈ సంస్థలకు త్వరలోనే నూతన పాలకవర్గాలను ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.

ఫాగింగ్ యంత్రం అందజేత



చౌటుప్పల్ రూరల్ ఫిబ్రవరి 29: చౌటుప్పల్ మండలం మందోళ్లగూడెం గ్రామపంచాయతీకి మాజీ ఉపసర్పంచ్ బోరెం ప్రకాశ్‌రెడ్డి రూ.55వేల విలువైన ఫాగింగ్ యంత్రాన్ని ప్రత్యేకాధికారి పృథ్విరాజ్‌కు గురువారం అందజేశారు. గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రకాష్‌రెడ్డిని పలువురు అభినందించారు.

ఆర్థిక సాయం అందజేత

వలిగొండ, ఫిబ్రవరి 29: మండలంలోని పహిల్వాన్‌పురం గ్రామానికి చెందిన యువతి వివాహానికి ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి సౌజన్యంతో రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

జాలలో ట్రాన్స్‌ఫార్మర్ల కాపర్ వైరు చోరీ

రాజాపేట, ఫిబ్రవరి 29: మండలం జాల గ్రామంలో బుధవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్ల కాపర్ వైరును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. వ్యవసాయ బావుల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి కాపర్ వైరు ఎత్తుకెళ్లారు. మాజీ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నవగ్రహాల విగ్రహాల ప్రతిష్ఠాపన

గుండాల, ఫిబ్రవరి 29: మండలంలోని సీతారాంపురం గ్రామంలో గురువారం నవగ్రహాల విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నవగ్రహాల విగ్రహ దాత మల్లెపాక మల్లేశ్, ఉపేంద్ర ఆజాద్, పూజారి వేణుగోపాలచార్యులు, మలి పెద్ది సంతోష్‌రెడ్డి, మలిపెద్ది వేణుగోపాల్‌రెడ్డి, మలిపెద్ది రాందయాకర్‌రెడ్డి, శివారెడ్డి, వల్లందాసు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో అనుమానాస్పద వ్యక్తులు

రాజాపేట, ఫిబ్రవరి 29: మండలం బొందుగుల గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను గ్రామస్థులు పట్టుకొని పోలీసులకు గురువారం అప్పగించారు. గ్రామంలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో వారిని వివరాలు అడుగగా భాష రాకపోవడంతో వారిని పోలీసులకు అప్పగించారు. పోలీసులు విచారణ చేయడంతో గ్రామంలో టవర్ మరమ్మతులు చేసేందుకు ఉత్తరాఖాండ్‌ను వచ్చారని పోలీసులు చెప్పారు.

డీఎస్సీ ప్రకటించడం హర్షణీయం

మోత్కూరు, ఫిబ్రవరి 29: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 83 రోజుల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి 11,062 పోస్టులు భర్తీ చేయడానికి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం పట్ల కాంగ్రెస్ మోత్కూరు మండల ప్రధాన కార్యదర్శి రాచకొండ బాలరాజు గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం 5,089 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వగా కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల లోపే 11,062 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చిందని పేర్కొన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి



నూతన కమిటీని సన్మానిస్తున్న అసోసియేషన్ నాయకులు

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 29: మెడికల్ దుకాణదారుల సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిరందాసు ధనుంజయ పిలుపునిచ్చారు. మెడికల్ అసోసియేషన్(కెమిస్ట్, డ్రగ్గిస్ట్) మండల నూతన కార్యవర్గాన్ని గురువారం భూదాన్‌పోచంపల్లిలో ఎన్నుకున్నారు. ప్రభుత్వం సైతం మెడికల్ దుకాణదారుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అధ్యక్షుడిగా అమృతం అశోక్, ఉపాధ్యక్షులుగా వేముల వేంకటేశం, డాక్టర్ సీత భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా గుద్దేటి సుధాకర్, సహాయ కార్యదర్శిగా రుద్ర ప్రభాకర్, కోశాధికారిగా చెరుకు ఆనంద్‌గౌడ్, గౌరవ సలహాదారులుగా సోమవరపు లక్ష్మీనారాయణ, సభ్యులుగా చిలువేరు అంజనేయులు, ఎర్రమాద శంకర్, గడ్డం మహేశ్వరి, బండి రవి, కె. సాంబిరెడ్డి ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు చిరందాసు ధనుంజయ, ఆర్గనైజింగ్ సెక్రటరీ గడ్డం వెంకటేష్, జిల్లా డైరెక్టర్ వారాల యాదిరెడ్డి నూతన కమిటీతో స్వీకారం చేయించారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

సంస్థాన్‌నారాయణపురం, ఫిబ్రవరి 29: అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి దోనూరు నర్సిరెడ్డి కోరారు. మండలకేంద్రంలో గురువారం జరిగిన అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని 2023లో 20 రోజుల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం హామీఇచ్చిందని గుర్తుచేశారు. ప్రభుత్వ హామీ మేరకు సమ్మె విరమించినా సమస్యలు పరిష్కరించలేదన్నారు. అంగన్‌వాడీ వర్కర్లకు నెలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రాడ్యుటీ చెల్లించాలని, ప్రభుత్వ బీమా సౌకర్యం రూ.5లక్షలు చెల్లించాలన్నారు. సమావేశంలో నిరూప సావిత్రి, మాధవి, రాణమ్మ, అరుణ, విజయ, పుష్పలత, జ్యోతి, ప్రేమలత, సత్తమ్మ పాల్గొన్నారు.

రాజ్యాంగం కల్పించిన హక్కులు వినియోగించుకోవాలి

భువనగిరి రూరల్, ఫిబ్రవరి 29: పౌరులు స్వేచ్ఛగా భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎస్. అంజిరెడ్డి అన్నారు. పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా మండలంలోని అనంతరంలో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కుల వివక్ష, మూఢ నమ్మకాలు, బడుగు బలహీన వర్గాలకు మౌలిక వసతుల కల్పన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సిహెచ్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

మోత్కూరు, ఫిబ్రవరి 29: మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళా శాలలోని ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని గురువారం బోర్డ్ స్క్వాడ్ తనిఖీ చేసింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు జనరల్‌లో 341 మంది విద్యా ర్థులకు ఇద్దరు, ఒకేషనల్‌లో 67మంది విద్యార్థులకుగాను ఆరుగురు గైర్హాజరయ్యారని పరీక్షాకేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ప్రభ జస్టిస్ తెలిపారు.

చౌటుప్పల్ టౌన్: చౌటుప్పల్ పట్టణంలోని ఐదు కేంద్రాల్లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఐదు కేంద్రాలకు 1013 మంది విద్యార్థులకు గాను 709 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద 114 సెక్షన్ విధించినట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

వలిగొండ: మండలకేంద్రంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 135మంది విద్యార్థులకు గాను ఇద్దరు పరీక్షలకు గైర్హాజరు గాకా 133మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఎగ్జామినేషన్ చీఫ్ లక్ష్మీకాంతకుమార్ తెలిపారు. లోతుకుంట మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రంలో 173 మందికి నలుగురు గైర్హాజరు కాగా, 169మంది పరీక్షలకు హాజరైనట్లు ఎగ్జామినేషన్ చీఫ్ రాము తెలిపారు. పరీక్షాకేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ చేశారు.

పట్టుదలతో చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించాడు



వలిగొండ, ఫిబ్రవరి 29: ప్రభుత్వం ప్రకటించిన జూనియర్ లెక్చరర్ ఉద్యోగానికి వలిగొండ మండలంలోని మునగాల తుర్కపల్లి గ్రామవాసి పారుపల్లి మత్స్యగిరి ఎంపికయ్యారు. ఈదయ్య, అండాలు దంపతుల కుమారుడు మత్స్యగిరిని కూలీ పనులు చేస్తూ చదివించారు. మత్స్యగిరి ప్రైవేట్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించాడు. ఉద్యోగానికి ప్రిపేర్ అయ్యే అభ్యర్థులు ఒక ప్రణాళికా బద్ధంగా కష్టపడి చదవాలని సమయాన్ని దృష్టిలో ఉంచుకోవాలని ఆయన తెలిపారు.

'గుట్ట'లో పెండింగ్ పనులు పూర్తిచేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుధాహేమేందర్‌గౌడ్

యాదగిరిగుట్ట రూరల్, ఫిబ్రవరి 29: పట్టణంలో పెడింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో 2024-25వ సంవత్సర ముసాయిదా బడ్జెట్‌ను పాలకమండలి సభ్యులు గురువారం ఏకగ్రీవంగా తీర్మానించారు. మార్చి 31 నాటికి ప్రారంభం నిల్వ రూ.18.18లు ఉండగా 2024- 2025 సంవత్సరపు రూ.1645.02 లక్షలుగా అంచనావేసి ఖర్చు చేయనున్నారని తెలిపారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సహకారంతో నిధులు మంజూరు చేయించి ప్రధాన సమస్యలు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ కాటంరాజు, పాలకమండలి సభ్యులు గౌలికార్ అరుణరాజేష్, బూడిద సురేందర్, సీస విజయలక్ష్మీకృష్ణగౌడ్, గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్, మాలోతు సరోజహరీష్, ముక్కెర్ల మల్లేశ్‌యాదవ్, దండెబోయిన అనిల్, కోఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య, బాబా, గోర్ల పద్మ, రిజ్వానాయాకూబ్, కమిషనర్ అజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.